
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 6 జూన్ 2024



ఆర్టీసీ పాసులు మరింత సులభతరం


అరసవల్లి: ఆర్టీసీ బస్సు పాసుల మంజూరు మరింత సులభతరం చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాసుల జారీకి కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12 నుంచి యధావిధిగా నూతన పాసులు జారీ చేస్తామన్నారు. విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు ప్రతిని తీసుకుని ఆన్‌లైన్‌లో ఏపీఎస్ఆర్టీసీపీపీఎస్ఎస్.ఐన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుకోవాలని సూచించారు. పలాస, టెక్కలి, శ్రీకాకుళం బస్ స్టేషన్లలోని బస్‌పాస్ కౌంటర్ల వద్దకు వచ్చి రాయితీ/ఉచిత బస్ పాసులను పొందవచ్చని తెలిపారు.



టీడీపీ దెబ్బ అదుర్స్

- జిల్లాలో అసెంబ్లీ, ఎంపీ స్థానాలు క్లీన్‌స్వీప్
- 1983, 1994 ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక్కో స్థానం
- ఈసారి మాత్రం మొత్తం ఊడ్చేసింది
- జగన్ పార్టీకి ఘోర ఓటమి





(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఈ ఎన్నికల్లో వైసీపీకి టీడీపీ కోలుకోలేని దెబ్బ కొట్టింది. కనీవిని ఎరుగని రీతిలో టీడీపీ విజయం సాధించింది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలతో పాటు లోక్‌సభ స్థానాన్ని క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. జిల్లా చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఏ పార్టీకీ దక్కిన సందర్భాలు లేవు. నందమూరి తారకరామారావు 1983లో టీడీపీని పెట్టి ప్రభంజనం సృష్టించినప్పుడు కూడా శ్రీకాకుళం జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానం చేజారింది. ఆ తర్వాత 1994లో ఎన్టీఆర్ హవాలో కూడా ఒక అసెంబ్లీ కాంగ్రెస్ గెలుచుకుంది. కానీ, ఇప్పుడు జగన్ అందించిన చెత్తపాలన కారణంగా జిల్లాలో వైసీపీ వైట్‌వాష్‌కు గురైంది. మొత్తం పది అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కైవసం చేసుకుంది. ఒక్క అసెంబ్లీ సీటు కూడా వైసీపీకి ఇవ్వలేదు. దీంతో టీడీపీ దెబ్బ అదుర్స్ అని ప్రజలు అంటున్నారు.

1983లో 11 సీట్లు కైవసం..

నందమూరి తారకరామారావు టీడీపీ పెట్టి తొమ్మిది నెలల వ్యవధిలో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో శ్రీకాకుళం అసెంబ్లీ నుంచి తంగి సత్యనారాయణ టీడీపీ నుంచి గెలుపొందారు. అతనికి స్పీకర్ పదవి ఇచ్చినప్పటికీ నాదెండ్లతో కలసి ఎన్టీఆర్ సర్కారును దించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి టీడీపీ అభ్యర్థులు బరిలోకి దిగారు. వీరిలో శ్రీకాకుళం అసెంబ్లీ నుంచి గుండ అప్పలసూర్యనారాయణ, నరసన్నపేట నుంచి సిమ్మ ప్రభాకరరావు, పాలకొండ-శ్యామరావు గొని పతి, పాతపట్నం-తోట తులసీదనాయుడు, ఇచ్ఛాపురం-మండవ వెంకటకృష్ణారావు, హరిశ్చంద్రపురం-కింజరాపు ఎర్రన్నాయుడు, ఉణుకూరు-కిమిడి కళావెంకటరావు, ఆమదాలవలస-తమ్మినేని సీతారాం, ఎచ్చెర్ల-కావలి ప్రతిభాభారతి, కొత్తూరు - నిమ్మక గోపాలరావు, టెక్కలి నుంచి అట్టాడ జనార్దనరావు గెలుపొందారు. సోంపేట నుంచి మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు.

1994లో ఉణుకూరు మినహా..

1994లో జరిగిన ఎన్నికల్లో జాతీయపార్టీ కాంగ్రెస్ పార్టీ మట్టికరిచింది. అప్పట్లో 12 నియోజకవర్గాల్లో కేవలం ఉణుకూరు అసెంబ్లీ మినహా అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ జెండా ఎగురవేసింది. టెక్కలి నుంచి నందమూరి తారకరామారావు, ఆమదాలవలస-తమ్మినేని సీతారాం, ఎచ్చెర్ల-కావలి ప్రతిభాభారతి, ఇచ్ఛాపురం- అచ్యుత రామయ్య దక్కట, పాతపట్నం-కలమట మోహనరావు, పాలకొండ-తలే భద్రయ్య, నరసన్నపేట-బగ్గు లక్ష్మణరావు, సోంపేట-గౌతు శివాజీ గెలుపొందగా.. ఉణుకూరు నియోజకవర్గం నుంచి కళావెంకటరావు కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమిచెందారు.

చరిత్ర తిరగరాసిన టీడీపీ..

2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీ పార్టీలతో జతకట్టి కూటమిగా ఏర్పడింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఏకంగా పది నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. సీనియర్లు.. మహామహులు మట్టికరిచేశారు. జగన్ పాలన చెత్తగా ఉండడంతో ప్రజలు కూడా విసిగి కూటమికే జైకొట్టారు. శ్రీకాకుళం-గొండు శంకర్, ఎచ్చెర్ల-నడుకుదిటి ఈశ్వరరావు, పలాస-గౌతుశిరీష, పాతపట్టణం-మామిడి గోవిందరావు, నరసన్నపేట-బగ్గు రమణమూర్తి, పాలకొండ-నిమ్మక జయకృష్ణ, ఇచ్ఛాపురం-బెందాళం అశోక్, టెక్కలి-కింజరాపు అచ్చెన్నాయుడు, రాజాం-కోండ్రుమురళీ, ఆమదాలవలస-కూనరవికుమార్‌లను భారీమెజార్టీతో ప్రజలు గెలిపించారు. ఏఒక్క సీటు కూడా ప్రధానపార్టీలో ఉన్న వైసీపీకి దక్కలేదు. చివరకు లోక్‌సభ స్థానం కూడా దక్కలేదు. మూడు దఫాలు టీడీపీ నుంచి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గెలుపొందారు.

సీదిరి ఓటమికి కారణాలెన్నో!

- భూకబ్జాలకు పాల్పడిన అనుచరులు
- దూరమైన వైసీపీ ప్రధాన కేడర్
- మంత్రి పట్టించుకోక ఓటుతో బుద్ధిచెప్పిన ప్రజలు



పలాస: మంత్రి సీదిరి అప్పలరాజు ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆయన ప్రధాన అనుచరులు నియోజకవర్గంలోని పంచభూతాలను మింగేస్తుంటే చోద్యం చూడడంతో పాటు వారిని మంత్రి ప్రోత్సహించారు. దీనిపై పత్రికలు, ప్రతిపక్షాలు ఘోషించినా 'మావాళ్లు ఏ తప్పు చేయలేదు. నిరూపిస్తే ఎంతటి త్యాగానికైనా సిద్ధమని' ఏకంగా భూకబ్జాలపై గ్రీవెన్స్ నిర్వహించి ఆ నెపాన్ని టీడీపీ నాయకులపై తోసేశారు. ఈ వ్యవహారం నియోజకవర్గంలో అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. పలాసలో నెమలికొండ, సూదికొండ, పురుషోత్తపురం చెరువు కాలువ, నెమలినారాయణపురం వద్ద విలువైన ప్రభుత్వ భూములు, జగన్న లేఅవుట్‌లో విలువైన భూములు, కోసంగిపురం జగనన్న లేఅవుట్ వద్ద స్థలాలు, మందస మండలంలో కొండలు, గిరిజన భూములు, వజ్రపుకొత్తూరు మండలంలో బెండి కొండ, అనంతగిరిలో కొండలు మొత్తం దోచి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారం ప్రజల్లోకి వెళ్లింది. దీంతో ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పారు. అలాగే గత ఎన్నికల్లో అప్పలరాజు విజయం కోసం నియోజకవర్గంలో అనేక మంది నాయకులు పని చేశారు. వారిలో దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబుచౌదరి, తలగాన నర్సింహులు, కొర్ల కన్నారావు, తదితరులు ఉన్నారు. గెలిచిన తరువాత వీరందరినీ మంత్రి పట్టించుకోవడం మానేశారు. దీంతో పార్టీని వీడి టీడీపీకి మద్దతు తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ కోట్ని దుర్గాప్రసాద్ వంటి వారు కూడా మంత్రి ఇలాకా నుంచి బయటకు రావాల్సిన పరిస్థితిని కల్పించారు. అప్పట్లో మంత్రికి అనుకూలంగా పనిచేసిన వరిశ హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, సీనియర్ నాయకులు మద్దు రాంప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు దున్న వీరాస్వామి వంటి వారు కూడా మొహం చాటేశారు. దీనికితోడు మంత్రి అనుచరులుగా చెప్పుకునే ఓ నలుగురు నాయకులు కాంట్రాక్టుల నుంచి కబ్జాల వరకూ, ఉద్యోగాలు వేయడం నుంచి మంత్రి పేషీలో చక్రం తిప్పే వరకూ- చివరకు ఎన్నికల నిర్వహణ కూడా ఆ నిర్వహించడంతో మొత్తం వ్యవహారం బెడిసికొట్టింది. క్యాడరంతా మంత్రికి దూరం కావడం, ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఇవన్నీ ఆయన ఓటమికి కారణమయ్యాయి.

రెండుసార్లూ కొత్తవారి చేతిలోనే..

- 2014లో లక్ష్మీదేవి.. ఈ ఎన్నికల్లో శంకర్ చేతిలో ధర్మాన ఓటమి







శ్రీకాకుళం క్రైం, జూన్ 5: జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఏడు పర్యాయాల్లో ఐదుసార్లు విజయం సాధించగా, రెండుసార్లు ఓటమి పాలైయ్యారు. అయితే, ఓడిపోయిన రెండుసార్లూ కొత్త అభ్యర్థుల చేతిలోనే కావడం గమనార్హం. నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం మబగాం గ్రామంలో పుట్టిన ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ యువజన నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. 1981లో మబగాం సర్పంచ్‌గా గెలిచారు. 1989లో తొలిసారి నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1999లో కూడా ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి పోటీచేసి టీడీపీ అభ్యర్థి గుండ అప్పలసూర్యనారాయణపై విజయం సాధించారు. 2014లో శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసిన గుండ లక్ష్మీదేవి చేతిలో 25వేల ఓట్ల తేడాతో ధర్మాన ఓటమి చెందారు. 2019లో మళ్లీ ధర్మాన గెలిచారు. అయితే 2024 ఎన్నికల్లో శ్రీకాకుళం కూటమి అభ్యర్థిగా తొలిసారి బరిలోకి దిగిన గొండు శంకర్ చేతిలో 54 వేల భారీ ఓట్ల తేడాతో ధర్మాన ఓటమి చవిచూశారు. ఇలా ఏడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ధర్మాన రెండుసార్లు ఇద్దరు కొత్త అభ్యర్థులపై ఊహించని ఓటమిని మూటగట్టుకున్నారు.



'ఎవరు గెలిచినా మీదే గెలుపు' కూపన్ల డ్రా తీస్తున్న బ్రాంచి మేనేజర్ సోమశంకరరావు

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతల డ్రా

- ఎచ్చెర్లలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నిర్వహణ
- జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి విరివిగా అందిన కూపన్లు

వెళ్లిన నాలుగు నెలలకే..

- సౌదీ అరేబియాలో జిల్లా యువకుడి మృతి
- చినవంకలో విషాద ఛాయలు




శంకర్(ఫైల్)

సౌదీఅరేబియాలో తన గదిలో శంకర్ మృతదేహం

వజ్రపుకొత్తూరు, జూన్ 5: ఉపాధి కోసం జిల్లాకు చెందిన ఓ యువకుడు నాలుగు నెలల కిందట సౌదీఅరేబియా వెళ్లాడు. అక్కడ అనారోగ్యానికి గురై బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వజ్రపుకొత్తూరు మండలం చినవంక గ్రామానికి చెందిన మదనాల సూర్యనారాయణ, కాంతమ్మ దంపతులకు కుమార్తె భారతి, కుమారుడు శంకర్ అలియాస్ సతీష్ (32) ఉన్నారు. శంకర్ పదో తరగతి వరకు చదివాడు. మూడేళ్ల కిందట ఉపాధి కోసం ఖతర్ దేశం వెళ్లాడు. అయితే, తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో స్వగ్రామానికి వచ్చేశాడు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లి వైద్యం కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. అయినా తల్లి కాంతమ్మ ఏడాది కిందట మృతి చెందింది. దీంతో అప్పుల భారం పెరగడంతో నాలుగు నెలల కిందట ఉపాధి కోసం సౌదిఅరేబియా వెళ్లాడు. డబ్బులు సంపాదించి అప్పులు తీర్చేసి ఆ తరువాత పెళ్లి చేసుకోవాలని భావించాడు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున సౌదీఅరేబియాలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు బోరున విలపించారు. వెళ్లిన నాలుగు నెలలకే శంకర్ మృతి చెందడంతో చినవంక గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్థులు కోరుతున్నారు.

అరాచక పాలనకు చరమగీతం



- ఐదేళ్లుగా బటన్ నొక్కుడే తప్ప అభివృద్ధి శూన్యం
- వ్యవస్థలను భ్రష్టుపట్టించిన జగన్
- విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలపై బాదుడు
- అడ్డూ అదుపులేని వైసీపీ నాయకుల అవినీతి
- ప్రశ్నించిన ప్రతిపక్షాలపై కేసులు
- కసితో ఓటేసి కూటమిని గెలిపించిన ఓటర్లు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సిక్కోలు ప్రజలు నమ్మితే అక్కున చేర్చుకుంటారు. తోకజాడిస్తే ఈడ్చి అవతల పడేస్తారు. ఈ విషయం ఈ ఎన్నికల్లో వైసీపీకి, ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి అవగతమైంది. ఐదేళ్లు సాగించిన విధ్వంస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. ఇన్నాళ్లు బటన్ నొక్కడమే తప్ప అభివృద్ధి చేద్దామన్న సంగతిని మరిచిన జగన్‌రెడ్డికి, వైసీపీ నాయకులకు జిల్లా ప్రజలు కర్రకాల్చి వాతపెట్టారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర చేపట్టిన జగన్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో దాన్ని ముగించారు. ప్రతి నియోజకవర్గంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై విమర్శలు గుప్పించేవారు. శ్రీకాకుళం జిల్లాను అద్భుత రీతిలో అభివృద్ధి చేసేస్తాను అంటూ ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చాక సీపీఎస్‌ను వారం రోజుల్లో రద్దు చేస్తామని మాట ఇచ్చారు. ఆ ఎన్నికల్లో కేవలం జగన్‌కూ ఒక్కచాన్స్ ఇద్దామని ప్రజలు భావించి ఫ్యాన్ గుర్తుకు ఓటేశారు. ఐదేళ్లు గడిచినా జగన్ ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీసం ప్రధాన రోడ్లుసైతం బాగుచేయలేకపోయారు. దీంతో వైసీపీ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ ఎన్నికల్లో కసితీరా ఓట్లేసి జగన్‌ను ఇంటికి సాగనంపారు.

దాడులు.. అరాచకాలు

జిల్లాలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకాలు.. దాడులు.. దౌర్జన్యాలే రాజ్యమేలాయి. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుపై తప్పుడు కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు దిగింది. పోలీసులు అచ్చెన్న ఇంటి గోడలను దూకి ఆయన్ను అరెస్టు చేశారు. ఆయన శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నా సరే విడిచిపెట్టకుండా రాష్ట్రమంతా తిప్పి అర్థరాత్రి దాటాక అరెస్టు చూపించారు. కోర్టు చీవాట్లు పెట్టినా సరే మరో రెండు కేసులు అచ్చెన్నపై మోపి జైలుకు పంపేందుకు కుట్రలు పన్నారు. అన్నింటిన్నీ అచ్చెన్నాయుడు భరించారు. ఇక పలాసలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను మహిళ అని చూడకుండా ఆమెపై వైసీపీ నాయకులు బూతు పురాణాలతో విరుచుకుపడేవారు. ఆమెపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు పెట్టేవారు. పోలీసులు సైతం స్పందించిన దాఖలాలు లేవు. ఆమె వెంటున్న ప్రతిఒక్క కార్యకర్తపై కేసులు నమోదు చేసి అక్రమంగా జైలుకు పంపారు. అయినప్పటికీ ఆమె బెదరలేదు. శివంగిలా మారి వైసీపీ నేతలపై పోరాటం చేశారు. చివరకు సీఐడీ నుంచి నోటీసులు అందుకుని పోరు సాగించారు. శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు చేసిన అభివృద్ధి ఈ ఐదేళ్ల కాలంలో శూన్యం. 'జగన్ బటన్ నొక్కుతున్నారు. ఆ డబ్బులు మధ్యవర్తులు లేకుండా లబ్ధిదారుల ఖాతాలో పడుతున్నాయి. ఇంతకుమించి అభివృద్ధి ఇంకేంటంటూ' ఊకదంపుడు ప్రసంగాలకే ఆయన ప్రాధాన్యం ఇచ్చేవారు. శ్రీకాకుళం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను పూర్తిచేయించుకోలేకపోయారు. శ్రీకాకుళం కేఆర్ స్టేడియాన్ని అసంపూర్తిగా వదిలేశారు. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా రెవెన్యూ మంత్రిగా ఆయన తీసుకున్న చర్యలు శూన్యం. ఆమదాలవలస నుంచి ప్రాతినిధ్యం వహించిన తమ్మినేని సీతారాంకు స్పీకర్ పదవి లభించినా ఆయన చేష్టలతో ఆ పదవికే మచ్చ తెచ్చారు. ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు తారు రోడ్డు పనులను పూర్తిచేయించలేకపోయారు. టీడీపీ నేత కూన రవికుమార్‌పై రౌడీషీట్ తెరిపించి- ఆయన్ను పలుదఫాలు అరెస్టు చేయించారు. కేవలం ప్రతిపక్షంపై కేసులు పెట్టేందుకే తాను ఉన్నట్టుగా వ్యవహరించారు. పలాసలో సీదిరి అప్పలరాజు సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అదృష్టం వరించి మంత్రి పదవి దక్కినా ఆయన చేసుకున్న స్వయంకృపరాధంతో మిత్రపక్షం కూడా దూరమైంది. అహంకారం, ఆపై కొండల ఆక్రమణపై పెట్టిన శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై పెట్టలేదు. టెక్కలిలో ప్రతిరోజూ నోరుపారేసుకునే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వైఖరితో సొంతపార్టీకి మరింత నష్టం చేకూరింది. మాట్లాడితే అంతా బూతు పురాణమే. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, అచ్చెన్నాయుడు వంటి నేతలను ఎన్నోసార్లు తూలనాడారు. ఇలా జిల్లాలో వైసీపీ తాజా మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిందేమీ లేదు. ఎంతసేపూ జగన్ భజన.. పరనింద అనే మాదిరిగా పాలన సాగించారు. ఇవన్నీ ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. దీంతో ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారు.

అభివృద్ధిని మరిచారు..

అమ్మఒడి, చేయూత, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, లా నేస్తం, విద్యా దీవెన, జగనన్న కాలనీ.. ఇలా చాలా పథకాలను ప్రవేశపెట్టారు జగన్మోహన్‌రెడ్డి. ఇవన్నీ సక్రమంగా అమలు చేయడంలో వైసీపీ సర్కారు విఫలమైంది. నవరత్నాల పేరు చెప్పి అందులో కోతలు విధించింది. దీంతో ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. విద్యుత్ చార్జీలు ఎన్నిమార్లు పెంచారో వైసీపీ నాయకులే చెప్పలేకపోయారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిత్యావసరాల ధరలు అదుపులోకి తేలేకపోయారు. ఆర్టీసీ చార్జీలను రెట్టింపు చేసేశారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్‌పై బాదుడే బాదుడు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద కొంతైనా రాయితీ ఇవ్వ లేదు. బటన్ నొక్కామని చెప్పి ఈ ఏడాది చేయూత వంటి పథకాలకు డబ్బులు ఎగ్గొట్టారు. వంశధార ప్రాజెక్టుకు మిగిలి ఉన్న 20శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. ప్రతి నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఇసుకాసురుల అవతారమెత్తి దర్జాగా కోట్ల రూపాయలు పోగువేసుకున్నారు. మళ్లీ ప్రజలు అధికారం ఇస్తారో లేదో అన్నరీతిలో అవినీతికి పాల్పడ్డారు. అయినా జగన్ సర్కారు చర్యలు శూన్యం. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో ఒక్క అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన దాఖలాలు లేవు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ రూపకల్పన అనేది గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పురుడుపోసుకున్నదే. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎత్తిపోతల పథకాలన్నింటినీ రద్దు చేసేశారు. నదుల అనుసంధానాన్ని అటకెక్కించారు. భావనపాడు పోర్టును మూలపేట పోర్టుగా పేరుమార్పు చేశారు. ఇంతకుమించి చేసిన అభివృద్ధి ఏమీ కానరాలేదు. దీంతో జగన్‌కు మళ్లీ అధికారమిస్తే తమ బతుకులు బాగుపడవని గ్రహించిన జిల్లా ప్రజలు ఈ ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించారు. జగనాసుర పాలన అంతమైందని సంబరపడుతున్నారు.

SCHOLARSHIP ALERT

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.

Kotak Junior Scholarship

Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.

- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region.

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 30-06-2024

Application mode: Online **Short Url:** www.b4s.in/aj/KJSP2

దిక్సూచి

Description: The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.

Aspire Leaders Program

Eligibility: This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program.

Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.

Prizes & Rewards: Free access to training modules, live sessions by Havard faculty, and much more

Last Date: 03-07-2024 **Application:** Online

Short Url: www.b4s.in/aj/ALPS1

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/la52NWCలో చదవండి.

Mirae Asset Foundation Scholarship Program



Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or post-graduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000

Last Date to Apply: 26-06-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/MAFS1

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ స్ట్రీమ్‌లో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి విభాగంలో 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో డిప్లొమాలు

డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి. జోగిపేటలో బాలికల పాలిటెక్నిక్; బసంత్‌పూర్, జమ్మికుంట, మల్‌తుమ్మెదలలో బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. వీటితో పాటు పాలెం, పొలాస, కంపసాగర్, మధిర, సిరిసిల్లా, రుద్రూర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 20 సీట్లు; నారాయణపేట పాలిటెక్నిక్ కళాశాలలో 40 సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో మొత్తం 390 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. మెదక్-తునికి, ఖమ్మం-సత్తుపల్లి, సంగారెడ్డి-తుర్కాల ఖానాపూర్‌లలో ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 90 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డ్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఎన్ఐఓఎస్, తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 35 శాతం మార్కులు తప్పనిసరి. అగ్రికల్చరల్ విభాగంలో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి 22 ఏళ్లు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **రిజిస్ట్రేషన్ ఫీజుకు చివరి తేదీ:** జూన్ 25
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** జూన్ 27
- **వెబ్‌సైట్:** diploma.pjtsau.ac.in

ప్రియమైన మామయ్యకు...

చంద్రబాబు, బాలకృష్ణకు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తెలుగు దేశం పార్టీలోని పలువురు నేతలకు జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన సోషల్ మీడియా వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని మామయ్య, బాలకృష్ణను బాబాయ్, పురందేశ్వరిని అత్త అని సంబోధిస్తూ ఈ ట్వీట్ చేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. "ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం సాధించిన ప్రియమైన మామయ్య నారా చంద్రబాబు నాయుడుకు నా హృదయపూర్వక అభినందనలు. మీ ఈ విజయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపున నడిపిస్తుందని ఆశిస్తున్నాను. మంగళగిరిలో అద్భుతమైన మెజారిటీతో గెలిచిన నారా లోకేశ్‌కి, మూడోసారి హిందూపూర్‌లో జయభేరి మోగించిన బాలకృష్ణ బాబాయికి, ఎంపీలుగా గెలిచిన భరత్, పురందేశ్వరి అత్తకి నా శుభాకాంక్షలు. అలాగే ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన పవన్‌కల్యాణ్‌కు కూడా నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.



తొలిసారి ఇటువంటి పాత్ర చేశా

టాలీవుడ్ చందమామగా పేరు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన పవర్‌ఫుల్ యాక్షన్ థ్రిల్లర్ 'సత్యభామ'. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించగా, సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. రేపు ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా కాజల్, చిత్ర నిర్మాతలు బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి మీడియాతో ముచ్చటించారు "దర్శకుడు సుమన్ చిక్కాల ఈ సినిమా కథ చెప్పిన వెంటనే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఓకే చేశా. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. నేను ఇప్పటివరకూ ఎన్నో పాత్రలు చేశాను.. కానీ ఇటువంటి ఎమోషనల్ యాక్షన్ రోల్‌లో నటించడం ఫస్ట్ టైమ్. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్ అన్నీ సహజంగా ఉంటాయి. సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే ప్రేక్షకులకు ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. మీరు ట్రైలర్‌లో చూసిన దాని కంటే ఎన్నో ట్విస్ట్‌లు సినిమాలో ఉంటాయి. శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకు అద్భుతమైన సంగీతంతో పాటూ అదిరిపోయే నేపథ్య సంగీతం ఇచ్చారు" అని చెప్పారు.

హేమను సస్పెండ్ చేస్తున్న 'మా'?



రేవ్ పార్టీ కేసులో అరెస్టైన నటి హేమపై మూవీ ఆర్టిస్టు అసోసియేషన్ ('మా') కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఆమె దోషిగా తేలితే చర్యలు తప్పవని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఇటీవల పేర్కొన్నారు. అందులో భాగంగా ఆయన కమిటీ సభ్యుల అభిప్రాయాలను కోరినట్లు తెలిసింది. మెజారిటీ సభ్యులు హేమను సస్పెండ్ చేయాల్సిందేనని వెల్లడించినట్లు సమాచారం. రేవ్ పార్టీ కేసు నుంచి హేమకు క్లీన్ చిట్ వచ్చేంత వరకూ 'మా' నుంచి సస్పెండ్ చేసేందుకు 'మా' కార్యవర్గం సిద్ధమైనట్లు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన గురువారం వెల్లడయ్యే అవకాశం ఉంది.

24 గంటల కస్టడీ

ఇదిలా ఉంటే జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న హేమను సీసీబీ పోలీసులు బుధవారం కస్టడీకి తీసుకున్నారు. ఆనేకల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి, 24 గంటలపాటు విచారణ కోసం అనుమతి తీసుకున్నారు. సీసీబీ పోలీసులు హేమను అరెస్టు చేసిన రోజే ప్రాథమికంగా విచారించారు. మరింత సమాచారం కోసం ఆమెను కస్టడీకి తీసుకున్నారు.

సెకండ్ ఇన్నింగ్స్ సూపర్

రాహుల్



కార్తికేయ గుమ్మకొండ, రాహుల్ టైసన్ హీరోలుగా నటించిన 'భజే వాయువేగం' చిత్రం ఇటీవల విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన 'హ్యాపీ డేస్' చిత్రంలో నలుగురు హీరోల్లో ఒకరిగా నటించి, 'టైసన్' పాత్రతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాహుల్ 'భజే వాయువేగం' సినిమాతో సెకండ్స్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. అన్ని వర్గాల ప్రేక్షకులూ చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నారనీ, తన పాత్రకు కూడా మంచి స్పందన వస్తోందని రాహుల్ 'చిత్రజ్యోతి'కి తెలిపారు. 'ఈ సినిమా విడుదలకు ముందు ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్, యూనిట్ సభ్యులందరం కలసి చూశాం. సినిమా బాగా వచ్చిందనీ, తప్పకుండా హిట్ అవుతుందని మా అందరికీ నమ్మకం కలిగింది. అదే అభిప్రాయాన్ని ప్రేక్షకులు కూడా వ్యక్తం చేస్తున్నారు. నా సెకండ్ ఇన్నింగ్స్ మరో మంచి సినిమాతో ప్రారంభించినందుకు ఆనందంగా ఉంది' అన్నారు రాహుల్.

ఈ సినిమాలో అవకాశం ఎలా వచ్చిందని అడిగితే 'యూవీ క్రియేషన్స్ ఓ చిన్న సినిమా ప్లాన్ చేస్తూ నాకు హీరోగా అవకాశం ఇచ్చింది. ఆ సినిమా పేరు 'గేడ' అది నిర్మాణంలో ఉండగానే యూవీ క్రియేషన్స్ నిర్మాతలే 'భజే వాయు వేగం' సినిమా ప్రారంభించారు. కార్తికేయ హీరోగా నటించే ఆ సినిమాలో సెకండ్ హీరో కోసం వెదుకుతుంటే ఆ చిత్ర దర్శకుడు ప్రశాంత్‌రెడ్డికి నా పేరు సూచించారు యూవీ క్రియేషన్స్ అధినేతలు. 'గేడ' సినిమాలో నేను చేసిన వర్క్ చూసి సంతృప్తి చెంది ప్రశాంత్‌రెడ్డి ఇందులో అవకాశం ఇచ్చారు. ఒకే సంస్థలో రెండు మంచి చిత్రాలు రావడం.. రియల్లీ ఐయామ్ లక్కీ' అని చెప్పారు రాహుల్. ఈ సినిమాతో కార్తికేయ రూపంలో మంచి స్నేహితుడు లభించాడనీ, సినిమాలో తామిద్దరి మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరిందని ఆయన తెలిపారు. కార్తికేయ, తను, తనికెళ్ల భరణి మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. తన కొత్త సినిమాల గురించి వివరిస్తూ 'గేడ' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో నాకు అది సెకండ్ ఫిల్మ్ అవుతుంది. మూడో సినిమా ఇప్పుడు నిర్మాణంలో ఉంది. వార్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఆ చిత్రాన్ని నా స్నేహితుడే నిర్మిస్తున్నారు. అది నా డ్రీమ్ ప్రాజెక్ట్. చాలా కాలం నుంచి దాని మీద వర్క్ చేసి ఇప్పుడు షూటింగ్ ప్రారంభించాం. శివ అని కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నాం. ఇందులో నేను సోలో హీరోగా నటిస్తున్నాను. ఆర్మీలో ఆయుధాలను ఎలా ఉపయోగిస్తారో, వాళ్ల ట్రైనింగ్ ఎలా ఉంటుందో నాలుగు నెలల పాటు ఓ ఆర్మీ పర్సన్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. దీని తర్వాత టైమ్ ట్రావెల్ ఫిల్మ్ చేస్తున్నాను. ఈ చిత్రాలన్నీ నాకు మంచి పేరు తెస్తాయనే నమ్మకంతో ఉన్నాను' అన్నారు రాహుల్.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZZ1WLfw లో చదవండి.

అంబరాన సంబరాలు

- నూతన ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం
- కేకులు కట్ చేసి వేడుకలు
- బాణసంచా కాల్చి అభిమానుల కేరింతలు
- మరింత బాధ్యతగా పనిచేస్తామంటున్న ఎమ్మెల్యేలు


కవిటి: కొజ్జిరియా వద్ద ఎమ్మెల్యే అశోక్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు


జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి..


హిరమండలం: మామిడి గోవిందరావును అభినందిస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు తదితరులు


కాశీబుగ్గ: గౌతు శిరీష గెలుపు కోసం మొక్కులు తీర్చుకున్న కార్యకర్తలు



అరసవల్లి: శ్రీకాకుళంలో గొండు శంకర్, నరసన్నపేట: కత్తెరవానిపేటలో బగ్గు రమణమూర్తిలకు అభినందన

(ఆంధ్రజ్యోతి బృందం)

సార్వత్రిక ఎన్నికల్లో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్న కూటమి అభ్యర్థులను బుధవారం ఆయా పార్టీల క్యాడర్ అభినందనలతో ముంచెత్తారు. వారి స్వగ్రామాలు, పార్టీ కార్యాలయాలకు వేలాది మంది టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చి బొకేలు, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చడంతో పాటు కేక్‌లు కట్ చేసి పంచిపెట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ● ఇచ్ఛాపురం నుంచి మూడో పర్యాయం ఎన్నికైన బెందాళం అశోక్‌కు సోంపేట మండలం కొర్లాం, కంచిలి, ఇచ్ఛాపురం, కవిటిలోని కొత్తకొజ్జిరియా జంక్షన్‌లలో అపూర్వ స్వాగతం పలికారు. స్వగ్రామం రామయ్యపుట్టుగలో మహిళలు నీరాజనాలు పట్టారు. గ్రామదేవత శ్రీ చింతామణి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ● పలాసలో గౌతు శిరీషను పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల కూటమి నేతలు కలిసి అభినందించారు. శాసనాం హైవే వద్ద వాహనాల రాకతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. శిరీష మాట్లాడుతూ.. గెలుపు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. పలాస కాశీబుగ్గ-మున్సిపాలిటీ 11వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు గౌతు శిరీష ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం గంజాం జిల్లా డుంబులలోని బంకేశ్వరి ఆలయంలో పూజలు చేసి గుండు కొట్టించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ● నరసన్నపేట మండలంలో పలు గ్రామాల్లో టీడీపీ క్యాడర్ రమణమూర్తి గెలుపొందడంతో కేక్‌లు కట్ చేసి పంచి పెట్టి ఆనందం వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల నుంచి కత్తెరవాని పేట చేరుకుని బగ్గు రమణమూర్తిని కలిసి అభినందించారు. అలాగే ఆయన స్వగ్రామం పోలాకి మండలం మబుగాంకు పెద్ద ఎత్తున పార్టీ క్యాడర్, అభిమానులు తరలి వచ్చి ఆయనను అభినందనలతో ముంచెత్తారు. ● ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఎన్.ఈశ్వరరావు ఎన్నికవడంతో జి.సిగడాం మండలంలో సంబరాలు చేసుకున్నారు. పెంట తదితర గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. ● ఆమదాలవలస ఎమ్మెల్యేగా గెలుపొందిన కూన రవికుమార్‌ను అభిమానులు అభినందనలతో ముంచెత్తారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఆయన ఇంటికి నేతలు, కార్యకర్తలు తరలివచ్చి అభినందించారు. అలాగే బీసీ న్యాయ వాదుల సంఘం నేతలు రవికుమార్‌కు శుభాభినందలు తెలిపారు. ● టెక్కలిలో టీడీపీ కార్యాలయంలో పార్టీ క్యాడర్ సంబరాలు చేసుకున్నాయి. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. పలు గ్రామాల్లో బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాతపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన మామిడి గోవిందరావును కార్యకర్తలు, నేతలు కలిసి అభినందించారు. ఎంజీఆర్ పాతపట్నంలోని నీలమణిదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన స్వగ్రామం తామరలో గ్రామ స్థులు ఘనస్వాగతం పలికారు. ● శ్రీకాకుళం నియోజక వర్గం నుంచి అత్యధిక రికార్డు మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే గొండు శంకర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక విశాఖ-ఎ కాలనీలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలు, నగరం నుంచి వందలాది మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ సంఘాల నేతలు తరలి వచ్చి అభినందించారు. రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన ప్రాంతంగా శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని శంకర్ అన్నారు. సిక్కోలు ప్రజల అభిమానం మరువలేనిదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు.


సరుబుజ్జిలి: శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలో రవికుమార్‌తో కరచాలనం


పలాస: శిరీషను అభినందిస్తున్న పారిశ్రామికవాడ జీడి వ్యాపారులు


టెక్కలి: టెక్కలిలో కేక్ కటింగ్ చేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు


నందిగాం: సైలాడలో విజయోత్సవాలు


కొత్తూరు: ఎంజీఆర్ విజయంతో పారాపురంలో కేక్ కట్ చేసి పంచుతున్న నేతలు

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతలు వీరే

- ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో కూపన్ల డ్రా

రూ.10 వేలు అందుకోనున్న విజేతలు వీరే..

1) ధర్మాన సూర్యనారాయణ, దేవాది, నరసన్నపేట, శ్రీకాకుళం జిల్లా
2) మాడెం నారాయణ, తోటవారి వీధి, పార్వతీపురం

రూ. 5 వేలు అందుకోనున్న విజేతలు వీరే..

1) చంద్రమౌళి విశ్వనాథ, నటరాజ కాలనీ, విజయనగరం
2) ఎం.సీతారామమూర్తి, దాసన్నపేట, డాల్ఫిన్ హైట్స్, విజయనగరం
3) త్రినాథరావు రెడ్డి, డకిని వీధి, విజయనగరం
4) బమ్మిడి వైకుంఠరావు, పెద్దవీధి, బలరాంపురం, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా
5) వై.నారాయణరావు, శ్రీకాకుళం
6) చెముడుపాటి సన్యాసిరావు, గుజరాతీపేట, శ్రీకాకుళం

ఎచ్చెర్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుస్తుందని ముందే చెప్పిన వారికి ఆంధ్రజ్యోతి నుంచి నగదు పురస్కారాలు లభించాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. అంచనాలను ప్రజల నుంచి ఆహ్వానించేందుకు గాను 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పేరిట 'ఆంధ్రజ్యోతి' వినూత్న ప్రయోగానికి ఎన్నికల నేపథ్యంలో ఇటీవల శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వారానికి రెండు చొప్పున మొత్తం ఎనిమిది కూపన్లను ప్రచురించిన విషయం తెలిసిందే. ఇలా ప్రచురితమైన కూపన్లను కత్తిరించి.. అందులో ఫలానా పార్టీ నుంచి ఫలానా నియోజకవర్గంలో గెలుస్తారంటూ ప్రజలు అంచనా వేసి వాటిని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయానికి పంపారు. ఇందులో అత్యధికమంది ఎన్డీఏ కూటమి గెలుస్తుందని ఊహించి ముందుగానే కూపన్లు పంపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు సంబంధించి కూపన్లలో బుధవారం ఎచ్చెర్ల ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో బ్రాంచి మేనేజర్ రౌతు సోమశంకరరావు తదితరులు డ్రా తీశారు. విజేతలను ప్రకటించారు. చెక్కు రూపంలో బహుమతులను త్వరలో విజేతలకు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి పి.బయపరెడ్డి, ఏసీఎం అనంత్ కుమార్, యాడ్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఎడిటోరియల్, యాడ్స్, సర్క్యులేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



వెంకన్న ఆదాయం రూ.2.70 లక్షలు

నరసన్నపేట: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. ఈ ఏడాది మార్చి 27 నుంచి బుధవారం వరకు భక్తులు హుండీల్లో వేసిన ఆదాయం రూ.2.70 లక్షలు వచ్చినట్లు ఈవో టి.రవి తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త పి.చిన్న వీరభద్రస్వామి, అర్చకులు కృష్ణమాచార్యులు, దేవదాయశాఖ పరిశీలకుడు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

9న వెంకన్నస్వామి కల్యాణం

టెక్కలి: మేజర్ పంచాయతీ టెక్కలి పట్టణంలోని శ్రీరామ కాలనీలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మూల వేమన తెలిపారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

శ్రీకాకుళంపై విజయనగరం జట్టు విజయం

టెక్కలి: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు చివరిరోజున శ్రీకాకుళం, విజయనగరం జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం జట్టు 35 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఈ జట్టులో రోహిత్ 64 పరుగులు సాధించగా విజయనగరం జట్టు బౌలర్ రాము నాలుగు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం జట్టు 37 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ జట్టులో దామోదర్ 52 పరుగులు చేయగా శ్రీకాకుళం బౌలర్లు జొన్నారావు నాలుగు వికెట్లు, వట్టికూళ్ల సన్నీ రెండు వికెట్లు తీశారు. ఈనెల 11 నుంచి నార్త్‌జోన్ అండర్-22 క్రికెట్ పోటీలు ఇదే మైదానంలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి రూ.20 వేల సాయం

సంతబొమ్మాళి: బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985లో పదో తరగతి చదివిన తోటి విద్యార్థి పాలతీర్థం రామారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అతని సహచరులు ఆయన కుటుంబానికి రూ.20 వేల నగదును అందించారు. శ్రీకృష్ణాపురంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతాడ చిన్నారావు, పిలక ధనుంజయకుమార్, ప్రియా రామచంద్రరావు, దుపాన తవిటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని అచ్చెన్న



టెక్కలి/నందిగాం: టెక్కలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కింజరాపు అచ్చెన్నాయుడుకు ప్రజలు పట్టం కట్టి అతనికి తిరుగులేదని నిరూపించారు. 2019 ఎన్నికల్లో 8,875 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన అచ్చెన్నాయుడు ప్రస్తుత ఎన్నికల్లో 34,534 ఓట్లు మెజార్టీ పొంది తన పట్టును మరోసారి నిరూపించుకున్నారు. ఈసారి సంతబొమ్మాళి మండలంలో అత్యధికంగా 10,391 ఓట్లు, టెక్కలి మండలంలో 9,058, కోటబొమ్మాళి మండలంలో 9,100, నందిగాం మండలంలో 4,229 ఓట్లు మెజార్టీ వచ్చింది. పోస్టల్‌బ్యాలెట్లు, సర్వీసు ఓట్లు 1,756 కలిపి మొత్తంగా 34,534 ఓట్లు మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో టెక్కలి, నందిగాం మండలాల్లో సుమారు 7,500 ఓట్లు వైసీపీ ఆధిక్యం కనబరచగా, ఈసారి నందిగాం, టెక్కలి మండలాల్లో సుమారు 13 వేల మెజార్టీ టీడీపీకి సమకూరింది. ఎప్పటిలాగే సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో టీడీపీకి మెజార్టీ లభించడంతో అచ్చెన్న విజయం సునాయాసమైంది. నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో 137 గ్రామపంచాయతీలకు గాను 125 మంది సర్పంచ్‌లు, 76 మంది ఎంపీటీసీలు వైసీపీకి ఉన్నా అనూహ్యంగా ఆయా పంచాయతీల్లో సైతం టీడీపీకి గణనీయమైన ఓట్లు లభించడంతో వైసీపీ నేతలే నిశ్చేష్టులవుతున్నారు. ఇక నియోజకవర్గ పరిధిలో వైసీపీకి అనుబంధంగా నాలుగు మండలాల సోషల్ మీడియా ప్రతినిధులు నిన్న, మొన్నటి వరకు చెలరేగి పోయినా అచ్చెన్నాయుడు గెలుపుతో వారి జాడ కనిపించడం లేదు. ఏది ఏమైనా టెక్కలి నియోజకవర్గం నుంచి అచ్చెన్నాయుడు భారీ మెజార్టీతో గెలుపొంది చరిత్ర సృష్టించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

స్వగ్రామంలో కృష్ణదాస్‌కు చుక్కెదురు

- అదే గ్రామంలో బగ్గుకు 388 ఓట్ల మెజార్టీ



నరసన్నపేట: మాజీ డిప్యూటీ సీఎం, వైసీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ స్వగ్రామం మబుగాంలో ఆయన కంటే టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తికి ఎక్కువగా ఓట్లు వచ్చాయి. మబుగాం పోలింగ్ బూత్ 220లో టీడీపీకి 617 ఓట్లు రాగా, వైసీపీకి 326 ఓట్లు వచ్చాయి. అలాగే 221 బూత్‌లో టీడీపీకి 420, వైసీపీకి 338, బూత్ నెంబర్ 222లో టీడీపీకి 322, వైసీపీకి 233 ఓట్లు, 223 బూత్‌లో టీడీపీకి 181 ఓట్లు, వైసీపీకి 255 ఓట్లు వచ్చాయి. టీడీపీకి మొత్తం 1,540 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థికి 1,152 ఓట్లు పోలయ్యాయి. వచ్చాయి. ఇద్దరు అభ్యర్థులదీ ఒకే గ్రామం కాగా రమణమూర్తికి 388 ఓట్లు మెజార్టీ వచ్చింది.

పవన్ కల్యాణ్ విజయంతో ఆనందం

మెళియాపుట్టి: పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ విజయం సాధించడంపై ఆయన అభిమానులు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు పవన్ కల్యాణ్ కీలకపాత్ర వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బాలరాజు, చంటి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న అభిమానులు

అప్రకటిత కరెంట్ కోతలతో ఇబ్బందులు

కొత్తూరు: మండల వ్యాప్తంగా కరెంట్ కోతలు అధికమయ్యాయి. రాత్రీ, పగలు తేడా లేకుండా ఎడతెరిపి లేకుండా పవర్ కట్ చేస్తున్నారు. ఒక వైపు ఎండలు పెరుగుతుండడం, మరోవైపు అనధికారికంగా కరెంట్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. పగటిపూట ఇంట్లో ఉండలేక, రాత్రి పడుకుందామన్నా కరెంట్ లేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. కరెంట్ బిల్లులు పెంచి సరిగా విద్యుత్ సరఫరా చేయక పోవడంతో ప్రజలు మండి పడుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో మండల వ్యాప్తంగా రాత్రి పూట చీకట్లు కమ్ముకుంటున్నాయి.

ముగ్గురూ.. ముగ్గురే





- ధర్మాన, శాంతి, కిరణ్‌ను మట్టికరిపించిన కూటమి అభ్యర్థులు
- కొద్దికాలంలోనే ఎమ్మెల్యేలుగా ఎంజీఆర్, ఎన్ఈఆర్, గొండు

మెళియాపుట్టి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన పలువురు అభ్యర్థులు వైసీపీ సీనియర్ నేతలను మట్టి కరిపించి ఔరా అనిపించారు. పోటీ చేసిన తొలిసారే రాజకీయ ఉద్దండులను సైతం ఓడించిన నేతలుగా పేరుపొందారు. అతి తక్కువ కాలంలోనే కూటమి అభ్యర్థులుగా సీటు సంపాదించుకుని ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాజకీయ పరిశీలకులను ఆశ్చర్య చకితులను చేశారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. శ్రీకాకుళం నుంచి కూటమి తరఫున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న మంత్రి ధర్మాన ప్రసాదరావును ఓడించి భారీ మెజార్టీ సంపాదించారు. అలాగే పాతపట్నం నుంచి కూటమి తరఫున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు సైతం తన ప్రత్యర్థి ఎమ్మెల్యే రెడ్డి శాంతిని ఓడించి సత్తా చాటుకున్నారు. ఆది నుంచీ స్థానికేతరులకే ఎక్కువ పర్యాయాలు ఆదరించిన పాతపట్నం నియోజకవర్గ ప్రజలు 2024 ఎన్నికల్లో మాత్రం స్థానికుడైన గోవిందరావును ఆదరించి విజేతగా నిలిపారు. రెడ్డి శాంతి ఓ పర్యాయం శ్రీకాకుళం ఎంపీగా పోటీ చేసి ఓటమి చవి చూశారు. 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పాతపట్నం నుంచి పోటీ చేసి విజేత కాగా ఆమెను 2024లో ఎన్నికల్లో గోవిందరావు ఓడించారు. స్థానికుడిగా ముద్రపడిన ఎంజీఆర్ అతి తక్కువ కాలంలో ఓటర్లను ఆకట్టుకుని విజేతగా నిలిచారు. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేసిన ఎన్.ఈశ్వరరావు (ఎన్ఈఆర్) ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌పై విజేతగా నిలిచి సత్తాచాటారు. అతి తక్కువ కాలంలోనే ఈ ముగ్గురు నేతలు ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సమయంలో ముచ్చెమటలు పట్టించి విజేతలుగా నిలవడంతో ఆ పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం కలిగింది.

కంచుకోటగా..



వజ్రపుకొత్తూరు: టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి కంచుకోటగా వజ్రపుకొత్తూరు మండలం నిలుస్తూ ఆ రికార్డును మరోసారి నిలబెటుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన గౌతు శిరీషాకు కూడా 14,216 ఓట్ల మెజార్టీ ఈ మండలం నుంచే వచ్చింది. 1983 నుంచి ఈ మండలం టీడీపీ అభ్యర్థులను ఆదరిస్తూ వచ్చింది. అయితే 2019లో వైసీపీ తరఫున పోటీ చేసిన సీదిరి అప్పలరాజు ఈ మండలానికి చెందిన వారు కావడంతో కేవలం ఆ పార్టీకి 875 ఓట్ల మెజార్టీ వచ్చింది. కానీ 2024లో మాత్రం మరలా టీడీపీ అభ్యర్థిని ఆదరించారు ఇక్కడి ఓటర్లు. ఈ మండలంలో అత్యధికంగా మత్స్యకారులు కావడం, వారంతా మొదటి నుంచి ఎన్టీఆర్ అభిమానులు కావడంతో పాటు ఈ మండలాన్ని దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన నేపథ్యంలో ఆ పార్టీనే ఆదరిస్తూ వచ్చారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రత్యేక గ్రామంగా గుర్తింపు పొందిన నువ్వలరేవులో టీడీపీకి భారీ మెజార్టీ వచ్చింది. గ్రామంలో నాలుగు పోలింగ్ బూత్‌ల్లో 4,157 ఓట్లు పోలయ్యాయి. వాటిలో టీడీపీకి 2,185 ఓట్లు వచ్చాయి. అలాగే బైపల్లి, గోవిదంపురం, పల్లిసారథి, గుణుపల్లి తదితర గ్రామాల్లోనూ టీడీపీకి మెజార్టీ వచ్చింది. వైసీపీ అభ్యర్థి స్వగ్రామం దేవునల్తాడలో ఆ పార్టీకి కేవలం 18 ఓట్లు మెజార్టీ రావడం గమనార్హం. ఆ గ్రామంలోనూ టీడీపీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి టీడీపీ అభ్యర్థికి గణనీయమైన ఓట్లు సాధించామని, టీడీపీకి మండలంలో బలం మరింత పెరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు తెలిపారు.

రాక్షస పాలనను అంతమొందించారు

కాశీబుగ్గ: ఐదేళ్ల రాక్షస పాలనను ప్రజలు అంతమొందించారని వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ హేంబాబు చౌదరి అన్నారు. కాశీబుగ్గలో పార్టీ కార్యాలయంలో బుదవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్ అహకారంవల్లే ఆ పార్టీ ఓటమి పాలైందన్నారు. పలాసలో సీదిరి అప్పలరాజు సొంత పార్టీ నేతలను అణచివేయడం, కాళింగ సామాజికవర్గ నాయకులపై దాడులు చేయించడం వల్లే ఆ పార్టీ ఓటమి పాలైందన్నారు. రాజకీయాల్లో అహంకారం పనికిరాదన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఇష్టానుసారంగా కారు కూతలు కూయించిన అప్పలరాజుకి దిమ్మతిరిగేలా చేశామన్నారు. పలాస ప్రాంత ప్రజలు విజ్ఞతతో ఆలోచించి గౌతు శిరీషను అత్యధిక మెజార్టీతో గెలిపించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

నోటాకే ఓట్లు అధికం



నరసన్నపేట: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థు లెవరూ ఇష్టం లేకుంటే నోటాకు ఓటు వేయవచ్చని ఎన్నికల కమిషన్ ఈవీఎంలలో నోటా బటన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా 2024 ఎన్నికల్లో జిల్లాలో అసెంబ్లీల వారీగా నోటాకు పడిన ఓట్లు ఇలా ఉన్నాయి.. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో 3,373 ఓట్లు, నరసన్నపేటలో 3300, ఆమదాలవలసలో 2300, ఇచ్ఛాపురంలో 4374 ఓట్లు, పాతపట్నంలో 3,604, టెక్కలిలో 7,342 ఓట్లు, పలాస నియోజకవర్గంలో 2,762 ఓట్లు, ఎచ్చెర్లలో 3,952 ఓట్లు వచ్చాయి. ప్రధాన పార్టీలను మినహాయించి ఇండిపెండెంట్, ఇతర పార్టీల అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువగా వచ్చాయి.


మార్కెట్ వెనుక భాగంలో నిలిచిన వాహనాలు

ఇచ్ఛాపురంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాల్టీ ట్రాఫిక్ కష్టాలకు నిలయంగా మారింది. మార్కెట్ వెనుక భాగంలో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం ఉదయం ఆటోలు, బైకులు, వ్యాన్‌లు ఒకేసారి రావటంతో మరోసారి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పార్కింగ్ సదుపాయం లేకపోవటంతో మార్కెట్‌కు వెళ్లే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో అటుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు గానీ.. పోలీసు అధికారులు గానీ పట్టించుకోకపోవటం దారుణమని స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఇబ్బదులు పడకుండా ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సర్వత్రా కోరుతున్నారు.

దర్జాగా ఇసుక అక్రమ రవాణా


రోడ్డు మీదే ఇసుక ట్రాక్టర్ నిలిపిన దృశ్యం

ఇచ్ఛాపురం: దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం దారుణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం పాత బస్టాండ్ జంక్షన్‌లో ట్రాక్టర్‌లో తెచ్చిన ఇసుక లోడ్‌ను రోడ్డుపై అడ్డంగా పెట్టి వెళ్లినా పోలీసులు పట్టించుకోకపోవటం గమనార్హం. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి


నారాయణబట్టిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కంచిలి: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కంచిలి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ కోరారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా విద్యాబోధనతో పాటు, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలను పొందవచ్చన్నారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో తెలుగు, ఇంగ్లీష్, ఒడియా మీడియంలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నారాయణబట్టి, గుండాం, కర్తలి, ఎంఎస్ పల్లి గ్రామాలలో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి.. తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయనతోపాటు కళాశాల సిబ్బంది గార వేణుగోపాలరావు, వాసుదేవ్, బబిత తదితరులు ఉన్నారు.

స్నానాల గదికి రూ.లక్ష విరాళం

కంచిలి: కంచిలిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తకోట సర్వేశ్వరరావు జ్ఞాపకార్థం నిర్మిస్తున్న స్వర్గధామంలో స్నానాల గది నిర్మాణానికి రోటరీ సభ్యుడు కొత్తకోట శేఖర్ రూ. లక్ష విరాళంగా అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తెలిపారు. ఈ మొత్తాన్ని రోటరీ కార్యదర్శి పీవీ కృష్ణారావు, ట్రెజరర్ కె.రవికుమార్‌లకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ధర్మారావు పాల్గొన్నారు.


రోటరీ సభ్యులకు విరాళం అందజేస్తున్న శేఖర్

శిథిలావస్థలో పాఠశాల భవనాలు

గార: గార మండలం కె.మత్స్యలేశం గ్రామంలో మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. సముద్రతీరానికి దగ్గరలో ఉండే ఈ పాఠశాల భవనాలు ఉప్పు గాలికి తొందరగా పాడైపోతున్నాయి. శిథిల స్థితిలో ఉన్న ఈ భవనాల్లో ప్రస్తుతం తరగతులు నిర్వహించడం లేదు. పక్కనే ఉన్న మరో రెండు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి ఐదు వరకూ సుమారు 40 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. విద్యార్థులు ఆటలు ఆడే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ శిథిల గదులను పడగొట్టించాలని తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న భవనాలు

ఈ తీర్పు పార్టీలకు కనువిప్పు

- అరాచక పాలనకు తప్పదు ముప్పు
- టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్

అరసవల్లి: ప్రజాస్వామ్యాన్ని మంట గలిపితే పర్యవసానం ఎలా ఉంటుందో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు తమ ఓటు ద్వారా రుచి చూపించారని ఆమదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం నగరంలోని శాంతినగర్ కాలనీలో గల తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అని జగన్‌రెడ్డి ప్రజలను అడిగినందుకు వారు కూడా రెండో చాన్స్ ఇవ్వలేదని అన్నారు. జగన్‌రెడ్డి తన పాలనను విధ్వంసంతో ప్రారంభిస్తే ఈ ఎన్నికల్లో ప్రజలు అటువంటి విధ్వంసకర తీర్పునే ఇచ్చారని కొనియాడారు. ఈ తీర్పు దేశంలోని అన్ని పార్టీలకు కనువిప్పు అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను సర్వనాశనం చేసి, అరాచక పాలన చేస్తే ఎటువంటి ప్రజాతీర్పు ఎదురవుతుందో ఈ ఎన్నికలు ఒక ఉదాహరణ అని అన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో తొలికేసు తనపైనే పెట్టారని అన్నారు. తన పోరాటం ఎప్పుడూ ప్రజల కోసమేనని చెప్పారు. వలంటరీ వ్యవస్థను ప్రజలను భయపెట్టడానికే జగన్ తీసుకువచ్చాడని.. కానీ ఆ వ్యవస్థే చివరకు ఆయనకు పాడె కట్టిందని విమర్శించారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రజల సమస్యలను తెలుసుకుని, వారికి సేవచేస్తూ, నిరంతరం వారికి అందుబాటులో ఉండడం ద్వారా రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.


అశోక్ గజపతిరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రవికుమార్

అశోక్‌ను కలిసిన రవికుమార్

సరుబుజ్జిలి: కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజును ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. విజయనగరంలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

భారీ వర్షంతో చెరువులుగా మారిన రహదారులు


సరుబుజ్జిలి: ఏబీ రోడ్డులో వర్షపునీరు


జి.సిగడాం: రోడ్డుపై వర్షపు నీరు

సరుబుజ్జిలి: మండల కేంద్రంలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో స్థానిక జంక్షన్‌లో నాలుగు రోడ్లు చెరువులను తలపించాయి. గత కొంతకాలంగా ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టు ప్రాంతాలు పూర్తిగా మూసుకుపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు గగ్గోలు పెడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అలికాం-బత్తిలి, సరుబుజ్జిలి-పాలకొండ రహదారిలో చిన్నపాటి వర్షం కురిస్తే నీరు రోడ్డుపై ప్రవహించి వాహనదారులకు, ప్రజలకు తీ వ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టులను సరిచేసి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జి.సిగడాం: మండలంలో బుధవారం ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఈ వర్షంతో కొంతమేర ఉపశమనం పొందారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తుండటంతో వరి సాగుకు వర్షం ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


నరసన్నపేట గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు


నందిగాం: ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వేసవి శిబిరాలతో సృజనకు పదును

నరసన్నపేట/పాతపట్నం/జలుమూరు: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పుస్తకాలపై ఆసక్తి పెరుగుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. బుధవారం నరసన్నపేట, పాతపట్నం, జలుమూరు శాఖ గ్రంథాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి శిబిరంలో పిల్లలకు ఆటలు, కథలు, చిత్రలేఖనం వంటి వాటిపై శిక్షణ ఇవ్వడం వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. జలుమూరు గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి.శంకరరావు, నరసన్నపేట, పాతపట్నం, జలుమూరు గ్రంథాలయ అధికారులు చాయరతన్, కళ్ల రాజు, ఆర్.డిల్లేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.చత్రపతి, ఆర్పీలు ఆనందరావు, బి.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

నందిగాం: స్థానిక శాఖాగ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పరిశ్రమల అభివృద్ధితో యువతకు ఉపాధి

రణస్థలం: పరిశ్రమలను అన్నివిధాలుగా అభివృద్ధి చేసుకుంటూ యువతకు ఉపాధి కల్పిద్దామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం రెడ్డీస్ పరిశ్రమ ప్రతినిధి కేవీఎస్‌ రాజు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కలిశారు. కొంత సమయం ముచ్చటించారు. పరిశ్రమల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎన్ఈఆర్ అన్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమ యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగారావు, దీపక్ కుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో రెడ్డీస్ పరిశ్రమ ప్రతినిధులు

ఇంటర్‌లో ప్రవేశానికి రేపు కౌన్సెలింగ్

పాతపట్నం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. కొత్తూరులోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ తెలిపారు. మెళియయాపుట్టికి సంబంధించిన మోడల్ స్కూల్ పాతపట్నంలోని వైటీసీ భవనంలో, భామినికి చెందిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీటిలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

ప్రజా తీర్పును శిరసావహిస్తా

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, ప్రజానీకం ఇచ్చిన తీర్పునకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాల్సిందేనని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. తన నివాసంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసినా ప్రజల నుంచి ఆశించిన స్పందన లభించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

చైర్మన్ పదవికి సూరిబాబు రాజీనామా

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఓటమి పాలు కావడంతో ప్రజా తీర్పును గౌరవిస్తూ కళింగ వైశ్య భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవికి అంధవరపు సూరిబాబు బుధవారం రాజీనామా చేశారు. 2020లో వైసీపీ ప్రభుత్వంలో చైర్మన్‌గా నియమితులైన సూరిబాబు తన రాజీనామా పత్రాన్ని విజయవాడలోని స్పెషల్ చీఫ్ సెక్రటరీ కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించారు.

సచివాలయ ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చాలి

ఆమదాలవలస: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కానున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడి, వారి ఆకాంక్షలను నెరవేర్చాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. విజయం సాధించిన ఎన్‌డీఏ కూటమి సభ్యులకు సచివాలయ ఉద్యోగుల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. తమ హక్కులను కాలరాసిన ప్రభుత్వానికి ప్రజల్లో వచ్చిన తిరుగుబాటుకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. గత ప్రభుత్వానికి ఉద్యోగులు పలుమార్లు సమస్యలపై విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. నూతనంగా ఏర్పడే ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించి ఉద్యోగులకు అండగా నిలవాలని కోరారు.


ఆదిత్యాలయంలో మహా లింగార్చన చేస్తున్న దృశ్యం

ఆదిత్యాలయంలో మహా లింగార్చన

అరసవల్లి: ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో బుధవారం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా శివ పంచాయతన సహిత మహా లింగార్చన నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. దర్భముళ్ల శ్రీనివాసశర్మ, ఇప్పిలి షణ్ముఖశర్మ, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: మొక్కలు నాటుతున్న నర్సింగ్ కళాశాల సిబ్బంది


పోలాకి: ప్రభుత్వ కళాశాలలో ప్లాస్టిక్ వస్తువులను సేకరిస్తున్న ఎంఈవో, విద్యార్థులు


నరసన్నపేట: సత్యవరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

ఘనంగా పర్యావరణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. ప్రకృతిని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

-ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఇచ్ఛాపురంలో ప్లకార్డులతో విద్యార్థుల ప్రదర్శన


ఇచ్ఛాపురం: బాలికోన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు


పలాస ప్రభుత్వ ఐటీఐలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు


టెక్కలి: మొక్కలు నాటుతున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు


వజ్రపుకొత్తూరు: అక్కుపల్లిలో మొక్క నాటుతున్న గ్రీన్‌ఆర్మీ, శ్రీరామ సేవా సంఘం సభ్యులు